ప్రజాశక్తి
సోమవారం 17 ఫిబ్రవరి 2025
5
కర్నూలు



మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

- ఈసారి 30 శాతం యాత్రికులు పెరిగే అవకాశం
- 25, 26 తేదీల్లో వాహనాల ఎంట్రీ ఫీజు ఉండదు
- అత్యాధునిక పద్ధతుల్లో పర్యవేక్షణ
- పారిశుద్ధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యత
- ప్రజాశక్తితో శ్రీశైలం దేవస్థానం ఇఒ ఎం.శ్రీనివాసరావు



ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

'మహా శివరాత్రికి శ్రీశైల క్షేత్రంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈసారి గతేడాదికంటే 30 శాతం యాత్రికులు పెరుగుతారనే అంచనాతో ఉన్నాం. ఈనెల 25, 26 తేదీల్లో శ్రీశైలం దేవస్థానానికి వచ్చే వాహనాలకు ఎలాంటి ఎంట్రీ ఫీజు వసూలు చేయకూడదనుకున్నాం. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అత్యాధునిక పద్ధతుల్లో డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పారిశుధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. దర్శనానికి వచ్చే వారి కోసం క్యూలైన్ల విస్తరణ చేస్తునాం. క్షేత్రంలోని సామాజిక సత్రాల వద్ద ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యమంత్రి, మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 24, 25, 26, 27 తేదీలలో 50 గ్రాముల ఉచిత లడ్డు ప్రసాదం భక్తులకు అందజేస్తున్నాం' అని శ్రీశైలం దేవస్థానం ఇఒ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయ ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

మహాశి వరాత్రికి ఎలాంటి ఏర్పాటు చేస్తున్నారు?

ఇఒ : మహాశివరాత్రికి శ్రీశైల క్షేత్రంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాదికంటే 30శాతం యాత్రికులు పెరుగుతారనే అంచనాతో అన్ని వసతులు పెంచుతున్నాం. దర్శనానికి వచ్చే వారి కోసం క్యూలైన్ల విస్తరణ చేస్తున్నాం. పారిశుధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అత్యాధునిక పద్ధతుల్లో ఆరు డ్రోన్ల ద్వారా కమాండ్ కంట్రోల్ నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా అనుచిత ప్రవర్తన చేసినా వెంటనే గుర్తించి చర్యలు తీసుకుంటాం. వయో వృద్ధులకు, వికలాంగులకు, చంటి తల్లి బిడ్డలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. శివరాత్రి రోజు రెగ్యులర్ దర్శనం మాదిరి కాకుండా తెల్లవారుజామున 2 గంటల నుండి ఎలాంటి బ్రేక్ లేకుండా స్వామి, అమ్మవార్లను దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నాం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా 26 లేదా 27వ తేదీ అందరికీ ఉచిత దర్శనం కల్పిస్తున్నాం. గతంలో 31 లక్షల లడ్డూలు తయారు చేయించే వారు. ఈసారి 35 లక్షలకు పైబడి తయారు చేయిస్తున్నాం. లడ్డు ప్రసాద విక్రయ కేంద్రాలు 22 నుంచి 29 వరకు పెంచుతున్నాం. అవి కాకుండా క్షేత్రంలోని సామాజిక సత్రాల వద్ద దాదాపు 20 సత్రాల వద్ద లడ్డు విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కో కౌంటర్ వద్ద ఐదు వేలకు తగ్గకుండా విక్రయించేలా పెడుతున్నాం.

మహా శివరాత్రికి ఈ సారి ప్రత్యేకతలు ఏమిటి..?

ఇఒ : ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 24, 25, 26, 27 తేదీలలో 50 గ్రాముల ఉచిత లడ్డు ప్రసాదం శ్రీశైలానికి వచ్చే భక్తులకు అందజేస్తున్నాం. రెగ్యులర్‌గా దేవస్థానికి వచ్చే వాహనాలకు ఎంట్రీ ఫీజు వసూలు చేస్తున్నాం. కానీ ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీశైలం దేవస్థానంకు వచ్చే వాహనాలకు ఎలాంటి ఎంట్రీ ఫీజు వసూలు చేయకూడదనుకున్నాం. ఒక రోజు అందరికీ ఉచిత దర్శనం కల్పిస్తున్నాం.

కాలినడకన వచ్చే భక్తులకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు..?

ఇఒ : కాలినడకన వచ్చే భక్తుల కోసం అన్ని చర్యలు తీసకుంటున్నాం. ఇప్పటికే మూడుసార్లు పర్యవేక్షణ చేశాం. కలెక్టర్, ఎస్‌పి, పోలీసులు, అటవీ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించాం. బైర్లూటి, నాగలూటి, పెచ్చెరువు, భీమునికొలను వద్ద సేద తీరేందుకు షామియానాలు, షెడ్లు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీరు, అన్నప్రసాదాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. ఇక్కడ వాలంటీర్లను, సెక్యూరిటీని 35 నుంచి 40 ఏళ్లలోపు దేహదారుఢ్యం, ఆరోగ్యంగా ఉండే వారిని నియమిస్తున్నాం. కాలినడకన వచ్చేవారిలో ఎవరైనా ఆయాసంతో అస్వస్థతకు గురయితే భుజాలపై మెడికల్ క్యాంపు సెంటర్, అంబులెన్స్ వద్దకు ఎత్తుకుని వచ్చేలా శిక్షణ పొందిన వారుంటారు. ఫస్ట్‌ఎయిడ్ అందుబాటులో ఉంచుతున్నాం. నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఒక కార్డియాలజిస్టు అందుబాటులో ఉంటారు. దేవస్థానం హాస్పిటల్ నుంచి మరో అసోసియేట్ కార్డియాలజిస్టు అందుబాటులో ఉంటారు.

పారిశుధ్యానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

ఇఒ: శానిటేషన్ పర్యవేక్షణ డిపిఒ ఆధ్వర్యంలో వెయ్యి మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. దేవస్థానం నుంచి 200 మంది సిబ్బంది, 1200 మంది కార్మికులు ఉంటారు. ఆరు జోన్లు, 11 సెక్టార్లలో 24/7 మూడు షిఫ్టులు ఏర్పాటు చేశాం. ఎలాంటి అపరిశుభ్రత లేకుండా టాయిలెట్స్, బాత్ రూమ్స్ ఏర్పాట్లు చేస్తున్నాం. వారిలో కూడా 1200 మంది శివసేవకులు వస్తున్నారు. వారిని కూడా అవసరమైన చోట ఉపయోగిస్తాం. ఇప్పటికే సామాజిక సత్రాల వారితో సమావేశం ఏర్పాటు చేసి పారిశుధ్యం, తాగునీటికి, అన్ని ప్రసాదాలకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశాం.

శివ స్వాములకు ఎలాంటి ఏర్పాటు చేశారు..?

ఇఒ : శివ స్వాములకు ఈనెల 19 నుండి 23 వరకు స్పర్శ దర్శనం ఉంటుంది. చంద్రావతి కళ్యాణ మండపం వద్ద వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.

సాంస్కృతిక కార్యక్రమాలకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

ఇఒ : సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. గతంలో మూడు వేదికలు ఉంటే ఈసారి నాలుగు వేదికలు ఏర్పాటు చేశాం. 2000 మంది కూర్చొవడానికి ప్రత్యేక థియేటర్ ఏర్పాటు చేస్తున్నాం. విభిన్నమైన కార్యక్రమాలు ఉంటాయి. ఎల్ఇడి స్క్రీన్ల ద్వారా స్వామి, అమ్మవారి ప్రత్యే పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా తిలకించే అవకాశం ఉంది.

శివరాత్రి సందర్భంగా భక్తులకు మీరిచ్చే ప్రత్యేక సూచనలు..?

ఇఒ: శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాటు చేస్తున్నాం. సంయమనంతో స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలి.



పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సాగునీరు లేకనే వలసలు : మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

రాయలసీమతో పాటు రాష్ట్రంలోని అన్ని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, వాటికి నిధులు కేటాయించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా రావాలంటే కృష్ణా యాజమాన్య బోర్డును ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలంలో పెట్టాలన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి అధ్యక్షతన కర్నూలు సూరజ్ గ్రాండ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడారు. తుంగభద్ర, కృష్ణా వెళ్తున్నా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సాగునీరు లేకపోవడం వల్లే వలసలు వెళుతున్నారన్నారు. గుండ్రేవులలో 15 నుంచి 20 టిఎంసిల వరకూ నిల్వ చేసుకోవచ్చని, 2019లో చంద్రబాబు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చారని, మళ్లీ అధికారంలోకి వచ్చి 9 నెలలైనా దానిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. గుండ్రేవులకు టెండర్లు ఎందుకు పిలవలేదన్నారు. గుండ్రేవుల కడితే ఎపి, తెలంగాణ రెండు రాష్ట్రాలకూ ఉపయోగమేనని, తెలంగాణతో సిఎంతో మాట్లాడాలని తెలిపారు. వేదవతి ప్రాజెక్టును కూడా ముందుకు తీసుకెళ్లడం లేదన్నారు. టిడిపి ప్రభుత్వం తొమ్మిది నెలలైనా కర్నూలులో హైకోర్టు బెంచి భవనాల నిర్మాణానికి ఎందుకు చర్యలు చేపట్టలేదన్నారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ పనులు నత్తనడకన సాగుతున్నా యన్నారు. గోదావరి నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకురావడం ఆచరణ సాధ్యం కానిదని, అవసరం లేనిదని చెప్పారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలను తీసుకొచ్చి నాగార్జున సాగర్ ఆయకట్టుకు వాడుకోవచ్చని, ఆ దిశగా అన్ని సంఘాలతో చర్చించాలని కోరారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ ఎపి అంటే అమరావతి, పోలవరం అనే ఆలోచనను మానుకోవాలన్నారు. అన్ని అవయవాలూ పని చేయకుండా మనిషి బతకలేదని సిఎం గమనించాలన్నారు. ఎపి సీడ్ కార్పొరేషన్, టెస్టింగ్ ల్యాబ్, కమిషనరేట్ రాయలసీమలో పెట్టాలని డిమాండ్ చేశారు. కుందూ వెడల్పు పేరుతో లక్షల ఎకరాల ఆయకట్టును నాశనం చేయాలనే చర్యలను మానుకోవాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు నిత్యం కరువు ప్రాంతంగా ఉందని, పాలకుల నిర్లక్ష్యం వల్ల వలసలు పోతున్నారని తెలిపారు. ప్రాజెక్టులకు భూములు ఇచ్చిన వారికి ఉపాధి లేకుండా పోతోందన్నారు. గుండ్రేవుల కడితే కెసి కెనాల్‌కు నిరంతరం నీళ అందుతాయన్నారు. వేదవతి ద్వారా 80వేల ఎకరాలకు నీళ్లు వస్తాయన్నారు. రైతులు త్యాగం చేస్తుంటే కార్పొరేట్ల అభివృద్ధి మాత్రమే జరుగుతోందని, దాన్ని ప్రతిఘటించాలని కోరారు. రాబోయే కాలంలో చేపట్టే కార్యక్రమాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కరువుతో అనంతపురం జిల్లాలో ఎడారి ఛాయలు వస్తున్నాయన్నారు. హంద్రీనీవా పంట కాలువలు పూర్తి చేసి రైతులకు నీళ్లివ్వాలన్నారు. జల సాధన సమితి అధ్యక్షులు రామ్ కుమార్ మాట్లాడుతూ అప్పు తెచ్చే డబ్బులను ప్రాధాన్యతా క్రమంలో సీమ పెండింగ్ ప్రాజెక్టులకు ఖర్చు పెట్టాలన్నారు. విద్యావంతుల వేదిక నాయకులు జి.భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. విద్యా పరంగా కూడా సీమను అభివృద్ధి చేయాలని, ఉన్న అన్ని కార్యాలయాలను అలాగే ఉంచాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, న్యాయవాది కరుణాకర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి టిజి.భరత్
- రూ.2.42 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


శంకుస్థాపన చేస్తున్న మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి. భరత్ అన్నారు. ఆదివారం 5 వార్డుల్లో రూ.2.42 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబుతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ముందుగా 50వ వార్డు కొత్తపేటలోని ముస్లిం స్మశాన వాటికలో రూ.20 లక్షలతో వసతుల కల్పనకు, 2వ వార్డు హజీర కాలేజీ నుండి వాసవి కాలేజీ వరకు రూ.35 లక్షలతో మురుగు కాలువ, 12వ వార్డులో డబరా కాలనీ, కెవిఆర్ గార్డేన్స్ ప్రాంతాల్లో రూ.62.4 లక్షలతో మురుగు కాలువలు, 24వ వార్డు లక్ష్మి నగర్ నందు రూ.75 లక్షలతో మురుగు కాలువ, 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లోని పలు కాలనీల్లో రూ.50 లక్షలతో మురుగు కాలువల నిర్మాణానికి మంత్రి, కమిషనర్ శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఎనిమిది నెలల నుండి నగరంలో కార్పొరేటర్లు, ప్రజలు తెలిపిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శంకుస్థాపన చేసిన పనులన్నీ మూడు నెలల్లోపు పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ శాఖనే కాకుండా ఇతర శాఖల సమస్యలను సైతం సాధ్యమైనంత త్వరగా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు రూ.6.5 లక్షల కోట్లు పెట్టుబడులు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో సాధించామని చెప్పారు. అందులో కర్నూలు జిల్లాకు సైతం అధిక సంఖ్యలో పెట్టుబడులు రావడం జిల్లా ప్రజలు హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ వాటిని దాటుకుంటూ, ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి దృష్టి సారించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారులపై 85శాతం వరకు గుంతలను ఏకకాలంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పూడ్చిందన్నారు. త్వరలో 2వ విడత పనులు ప్రారంభమవుతాయని అన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో చాలా చోట్ల మురుగు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, పూడికతీత పనులు సైతం చేపట్టేందుకు పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందిగా ఉండటంతో, మంత్రి ఆదేశాల మేరకు మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ప్రతి వార్డులో కాలనీల వారీగా ప్రాధాన్యత క్రమంలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని, 40 రోజుల నుండి 3 నెలలలోపు జాప్యం జరగకుండా పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. అనంతరం మంత్రి, అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించి, స్థానికులు తెలిపిన సమస్యలను విన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు పరమేష్, అన్నెపోగు క్రాంతి కుమార్, జక్కుల రమణమ్మ, షేక్ అహ్మద్, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షకులు నాగరాజు, డిఇఇలు క్రిష్ణలత, గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, ట్రైనీ ఎఇలు స్వాతి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కార్యవర్గంకు ఎంపికైన నాయకులు

ప్రభుత్వ విద్యా విధానాన్ని బలోపేతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులుగా అబ్దుల్లా, రంగప్ప

ప్రజాశక్తి- ఆదోని

జాతీయ నూతన విద్యా విధానం వల్ల ప్రభుత్వ విద్యకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని వ్యతిరేకిస్తూ ఆందోళన తీవ్రతరం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా మహాసభలు ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిస్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారం కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పని చేస్తుందని, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

కర్నూలు జిల్లా నూతన కార్యవర్గం: 25 మందితో కర్నూలు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్లా, జిల్లా కార్యదర్శిగా రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, సాయిఉదయ్, విజయ్, సంయుక్త సహాయ కార్యదర్శులుగా రంజిత్, అమర్, అంజి, కమిటీ సభ్యులుగా 18 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... విద్యా రంగంలో నెలకొన్న సమస్య పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని అన్నారు. అదేవిధంగా ఆదోని పట్టణంలో మెడికల్ కళాశాల పనులు వెంటనే ప్రారంభించి తరగతి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదోని పట్టణంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించేంతవరకు అదే విధంగా, నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా, స్థానిక విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా బాధితుల నుండి గ్రీవెన్స్ స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాషాషాక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ మున్సిపల్ మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై 19న జిల్లా వ్యాప్త నిరసన

- వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజావ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని ఫిబ్రవరి 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా కర్నూలు జిల్లాలో ఈనెల 19న అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శిడి.గౌస్ దేశాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బడ్జెట్లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయతులిస్తూ పేద ప్రజలపై మోయలేని భారాన్ని వేసిందని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, విభజన హామీల మాట ఒకటి కూడా లేదని, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి , విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేస్తామని గాని బడ్జెట్ ప్రసంగంలో లేకపోవడం ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం కేంద్ర ప్రభుత్వం చేసిందని పేర్కొన్నారు. కళ్ళుండి చూడలేని గుడ్డివానిలా, చెవులుండే వినలేని చెవిటి వానిలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడంలో వైఫల్యం చెందిందని తెలిపారు. రాష్ట్రానికి రావలసిన నిధులు రాబట్టడానికి, అడగడానికి చేతగాని ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉందని వారు ఎద్దేవా చేశారు. అందుకోసం ప్రజలు ఈ రాష్ట్రానికి రావలసినది నిధులు రాబట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్ సవరణలు చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావడానికి ప్రయత్నం చేయాలని కోరారు. ఈ ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకురావడం కోసం వామపక్షాలు నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సుగాలి ప్రీతిబాయి కేసును ఎలా వదిలేస్తారు..?

- కెవిపిఎస్, విద్యార్థి, యువజన సంఘాలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పోరేషన్

అణగారిన వర్గాలపై జరిగిన అఘాయిత్యాలపై ఊగిపోయి ప్రసంగించిన పవన్ కళ్యాణ్ ఎసిబి వదిలేసిన కర్నూలు జిల్లా ప్రీతిబాయి కేసుకు సంబంధించి స్పందించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. డి.ఆనంద్‌బాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.అబ్దుల్లా, రాఘవేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని కొత్త బస్టాండ్‌వద్ద ఉన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ కెవిపిఎస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 లో యావత్ రాష్ట్రమే తలదించుకునేలా కర్నూలులో సుగాలి ప్రీతిబాయి అనే విద్యార్థినిపై అత్యాచారం హత్య ఘటనలు జరిగాయన్నారు. ఎన్ని బెదిరింపులు, అవాంతరాలు ఎదురైనా గత ఏడేళ్లుగా తన కూతురికి జరిగిన అన్యాయంపై సుగాలి ప్రీతిబాయి తల్లిదండ్రులు పోరాటం చేస్తూనే ఉన్నారన్నారు. ప్రీతిబాయి న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాన్ని తాను అధికారంలోకి రాకముందు అమాంతం మీదేసుకున్న జనసేనాని పవన్ కళ్యాణ్, దోషులకు శిక్ష పడేంత వరకు వదిలేది లేదని ఊగి ఊగి ఉపన్యాసాలు చెప్పారన్నారు. కానీ ఈరోజు ఎసిబి తాను రాతపూర్వకంగా వనరులు లేని కారణంగా ప్రీతిబాయి కేసును వదిలేస్తున్నట్లు హైకోర్టుకు సమర్పించిన లేఖకు సంబందించి పత్రికల్లో రావడంతో దళిత, గిరిజన, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాలన్నీ తీవ్ర ఆవేదన చెందాయన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్‌కు తెలియకుండానే ఇది జరుగుతోందా అని వారు ఎద్దేవా చేశారు. దళిత, గిరిజనుల పైన రోజురోజుకు అఘాయిత్యాలు పెరుగుతున్నా వాటిపై స్పందన పాలకవర్గాల తీరు ఒకే రకంగా ఉంటుందని నిరూపిత మౌతోందన్నారు. అహంకారుల పైశాచికానికి పేదల బతుకులు చెట్లగుట్ల పాలవుతుంటే, వాటిని పరిష్కరించాల్సిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏమో గుడులు గోపురాలు తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా పవన్ కళ్యాణ్ స్పందించి సుగాలి ప్రీతిబాయి కేసులో అసలైన ముద్దాయిలకు శిక్షపడేలా చేస్తారా లేక నా మాటలు సినిమా డైలాగులు లాంటివని వదిలేస్తారా వెంటనే సమాధానం చెప్పాలన్నారు. సుగాలి ప్రీతిబాయి కుటుంబానికి న్యాయం జరిగేలా అసలైన దోషులకు శిక్షపడేలా రానున్న కాలంలో కలిసొచ్చే వారందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న నాయకులు ఆనంద్ బాబు

నైపుణ్యానికి నిదర్శనం బెల్ట్ గ్రేడింగ్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

తైక్వాండోలో క్రీడాకారులకు ఇస్తున్న బెల్ట్ గ్రేడింగ్‌లు వ్యక్తిగత నైపుణ్యానికి నిదర్శనమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టుల కార్యక్రమాన్ని భూపతిరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు లాంఛనంగా ప్రారంభించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించి రెండు నుంచి మూడు శాతానికి పెంచిన స్పోర్ట్స్ కోటాను వినియోగించుకునేందుకు పోటీ పడాలని వారు కోరారు. సాధన చేస్తూ ప్రమోషన్ బెల్టులను సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి వెంకటేశ్వర్లు, తైక్వాండో అకాడమీ ప్రతినిధులు నందికొట్కూరు రాంబాబు, కర్నూల్ రాంబాబు, షకీల్, పిఇటిల సంఘం ప్రతినిధి కొండపోగు చిన్న సుంకన్న, డిఎస్ఎ కోచ్ మహేష్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న భూపతిరావు, రామాంజనేయులు



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్

క్లస్టర్ సమావేశాలప్పుడు సెలవు ప్రకటించాలి

- కె.సురేష్ కుమార్ : యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్ : క్లస్టర్ సమావేశాల సమయంలో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు యుఆర్ఎ రవి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.సురేష్ కుమార్ మాట్లాడుతూ జిఒ నెంబర్ 117ను రద్దు చేసినట్లే ప్రకటించుకుంటూ మరో పక్కన పాఠశాలలను కుదించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రాథమిక పాఠశాలలను మూసి వేయకుండా వాటిని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సి ప్రకటించాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో ఉద్యమాలు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, గౌరవ అధ్యక్షుడు దావీదు, సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యెహోషువ, జిల్లా కార్యదర్శిలు గాదిలింగ, తిమ్మన్న, కౌలన్న, వెంకటేష్, సురేష్ బాబు, లక్ష్మీదేవి చంద్రకళ ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - మద్దికెర

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించి పూర్తిస్థాయిలో వినియోగం లోకి తీసుకొచ్చినట్లు ఎంపిడిఒ కొండయ్య పంచాయతీ అధికారులు తెలిపారు. సర్పంచి సుహాసిని, జడ్‌పిటిసి మురళీధర్ రెడ్డి, వార్డ్ మెంబర్ లక్ష్మీనారాయణ సమక్షంలో శనివారం పునర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు తడి పొడి చెత్తను వేరు చేయడం వల్ల గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ప్రతిరోజు గ్రామాల్లో ఉన్న చెత్తను సేకరించి వర్మి కంపోస్ట్ తయారుచేసి రైతులకు అందిస్తామని రైతులు ఈ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కేంద్రాల ద్వారా సంపద సృష్టించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-ఆదోని

104 ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు ఉపాధ్యక్షుడు ఈరన్న హెచ్చరించారు. ఆదివారం ఆదోనిలో అంబేద్కర్ సర్కిల్లో ఉద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యద్శి పెద్దయ్య ,ఉపాధ్యక్షులు వెంకటేశులు మాట్లాడారు. 104 డ్రైవర్ ,డిఇఒలుగా పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా వుంటూన్నామన్నారు. రోగులకు సేవలు అందిస్తూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని వస్తున్నామన్నారు. కొత్తగా తయారు చేసిన ఆర్ఎఫ్పిలో డిఇఒలకు జీత భత్యాల విషయంలో ఎటువంటి మార్పు జరగ లేదన్నారు. అదేవిధంగా స్లాబ్ విషయంలో స్పష్టత లేదన్నారు. పిఎఫ్ అండ్ ఇఎస్ఐ విషయంలో స్పష్టత లేకపోవడం వల్ల తాము ఆందోళనకు గురవు తున్నామన్నారు. అంతిమంగా సిటీసి అనే పదాన్ని పెట్టడం జరిగిందన్నారు. దీనివలన యాజమన్యాలు ఉద్యోగులకు తీవ్ర నష్టాన్ని కలుగ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఉద్యో గులకు న్యాయం చేయాలని విన్నవిస్తు న్నామన్నారు. 104 లో పని చేస్తు న్నా డిఇఒ డ్రైవర్స్ అందరికి స్లాబ్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని ఎడల ఆందోళన చేస్తామన్నారు.



ఏ ఒక్క పాఠశాలను మూసేయరాదు

-ఉద్యోగులకు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పాఠశాల విద్యాశాఖలో సంస్కరణల పేరిట పాఠశాలలను మూసివేయరాదని, మండల విద్యాశాఖ అధికారులు పోస్టులను రద్దు చేయరాదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరాముడు, గట్టుతిమ్మప్ప డిమాండ్ చేశారు. ఆదివారం డిటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కరెకృష్ణ మాట్లాడుతూ పాఠశాల విద్యలో సంస్కరణలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలు, హైస్కూళ్లను రద్దు చేయకూడదన్నారు. జీవో నెంబర్ 117 ను సంపూర్ణంగా రద్దు చేసి మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షనర్లకు 12వ పిఆర్సి కమిషన్ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగులో ఉన్న రూ.21 వేల కోట్ల పిఎఫ్, ఎపిజిఎఐ, ఇఎల్ బకాయిలను చెల్లించాలని రెండు విడతల కరవు భత్యాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ కాంప్లెక్స్ ల పేరిట మండల విద్యాశాఖ అధికారుల పోస్టులను రద్దు చేయకూడదని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిటిఎఫ్ ఉపాధ్యాయ క్రాంతి పత్రిక ప్రధాన సంపాదకులు రత్నం ఏసేపు డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్స్ మోహన్ , గోట్ల చంద్రశేఖర్, రవీంద్ర జిల్లా బాధ్యులు నాగరాజ్ గౌడ్ రామన్న ఈశ్వర్ రెడ్డి వెంకటేశప్ప రంగస్వామి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని గోనెగండ్ల ఇన్స్పెక్టర్ ఎ.గంగాధర్ అన్నారు. శనివారం గోనెగండ్ల గ్రామం లోని సమీప రహదారిలో పలువురు వాహనదారులకు బ్రీతింగ్ అనలైజర్ ద్వారా శ్వాస పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఉద్దేశించి ఇన్స్పెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే చట్టరీత్యా చర్యలు తప్పవని, కోర్ట్ కు వెళ్ళవలసిందేనని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఇతర వాహనదారులు కూడా ఇబ్బందులు పడతారని, ప్రమాదాలకు గురి అవుతారని అన్నారు. ఇకపై ప్రతిరోజు రోడ్డు పైన ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తామని దొరికిన వారిని చట్టరీత్యా శిక్షిస్తామని అన్నారు. డ్రైవర్లు విధి నిర్వహణలో భాగంగా ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని వారిని నమ్ముకున్న వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఎంతయినా ఉందని గుర్తించాలని సిఐ అన్నారు. గోనెగండ్ల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బ్రీతింగ్ ఎనలైజర్తో పరీస్తున్న గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్

లేటెస్ట్ డిజైన్ బ్లౌజ్లకు కేరాఫ్ 'కదంబస్'

అన్ని రకాల బ్లౌజులు తక్కువ ధరలకే కుట్టబడును

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ప్రకాష్ నగర్లోని కదంబస్ డిజైనర్ స్టూడియోలో అన్ని రకాల బ్లౌజులు తక్కువ ధరలకే వేగంగా, అందంగా, పర్ఫెక్ట్గా కుట్టి ఇస్తామని డిజైనర్ స్టూడియో ఓనర్ ముత్యాల సుప్రజ తెలిపారు. ఇంట్లో ఖాళీగా ఉంటూ ప్రారంభించిన ఈ సంస్థ ఇప్పుడు దాదాపు 40 మంది దాకా ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందంటే దానికి కారణం తాము కస్టమర్కు అనుగుణంగా వారికి కావల్సినట్టు ,సమయానికి అన్ని రకాల వర్క్లు చేసి అందిస్తున్నందుకే అని తెలిపారు. తమ దగ్గర స్టిచ్చింగ్, మగ్గంవర్క్, డైయింగ్, ఎంబ్రాయిడరీ వర్కులు చేస్తామని అన్నారు. తమ దగ్గర పనిచేసే వారంతా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిష్ణాతులని తెలిపారు. మా సంస్థ ప్రారంభించి 11యేళ్లు పూర్తయిందని తెలిపారు. కస్టమర్ కోరుకున్న విధంగా వర్క్ను చేసి ఇవ్వడం ప్రత్యేకత అని తెలిపారు. వర్క్ పూర్తయిన తర్వాత డెలివరీ తమ సిబ్బంది ద్వారానే చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నామన్నారు.



వివాహ వేడుకలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-నందవరం

నందవరం మండలం హాలహర్వి గ్రామం నల్లబోతుల రంగన్న తమ్ముడి కుమార్తె పద్మావతి, వెంకటేశు వివాహ వేడుకలకు వైసిపి నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక భర్త, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదే గ్రామంలో జరిగిన కురువ తిక్కయ్య కుమారుడు నగేష్ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ బంధం పవిత్రమైనది కొత్త దాంపత్య జీవితంలో వధూవరులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సిరి సంపదలతో జీవించాలని సుభాశీస్సులు అందజేశారు. నందవరం మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, గడ్డం నారాయణ రెడ్డి, విరుపాక్షి రెడ్డి, చేనేత జిల్లా అధ్యక్షులు ఎంకె.శివప్రసాద్, సర్పంచి తిమ్మప్ప, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు శాంతిరాజు, బజారి, రంగన్న, ప్రతాప్, దుబ్బ నల్లన్న, తలారి తిక్కయ్య, జయరాజు, ఆనంద్, దస్తగిరి, వెంకటస్వామి, శేఖర్, హేప్రియా,మాల మారెప్ప తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వారు జగ్గాపురం గ్రామంలో జరిగిన వైసీపీ నాయకులు రామాంజినేయులు కుమారుడు వీరేష్ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను దీవించారు. వెంకటాపురం బజారి, ఎంపిటిసి ఈరన్న,బొకి ఈరన్న,అనుమంతు, నరసన్న పాల్గొన్నారు.



రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

కాంగ్రెస్ డిమాండ్

ప్రజాశక్తి-ఆదోని

ప్రయాణికుల రద్దీ కనుగుణంగా ట్రైన్లను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేసిన రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర సమావేశంలో పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ మాట్లాడారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది మృతి చెందడం దారుణం అన్నారు. ఇది చాలా బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం వ్యక్తం చేసారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సంఘటన మరోసారి రైల్వేల వైఫల్యాన్ని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బహిర్గతమైందని అన్నారు. ప్రయాగ్రాజ్కు పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్తున్నందున , స్టేషన్లో మెరుగైన ఏర్పాట్లు చేసి ఉండాలన్నారు. ఈ ఘటనపై నిర్వహణ లోపం బాగా కనిపిస్తోందని అసహనం వ్యక్త్యం చేసారు. ఇంతటి నిర్లక్ష్యం కారణంగా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి తక్షణమే రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు దిలీప్ దొక, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతీ రావు, శ్రీనిత్ ఉన్నారు.

మలేరియా జోనల్ అధికారి తనిఖీ

ప్రజాశక్తి-మద్దికేర

మలేరియా జోనల్ అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ మద్దికేర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మలేరియా సీజనల్ వ్యాధులకు సంబంధించి దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని, దోమ కాటు వల్ల కలిగే వ్యాధులపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తెలుపాలని, ఆర్డిటి కిట్ల ద్వారా ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరం వచ్చిన వారి ఇంటి వద్దకే వెళ్లి మలేరియా టెస్ట్ నిర్వహించి ఇంటి వద్దనే చికిత్సలు అందజేయాలని తెలిపారు. వైద్యాధికారిణి డాక్టర్ రాగిణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిరంజన్ బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సూపర్వైజర్లు కృష్ణమ్మ, సూర్యనారాయణ ,ల్యాబ్ టెక్నీషియన్ విజయకుమార్, ఫార్మసిస్ట్ జ్యోతిబాయ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.1257/2023

శ్రీమతి.యన్.రమాదేవి. ...వాది

- ఎదురి -

అన్వర్మన్సూర్హుశేన్ మరియు ఒకరు. ...ప్రతివాదులు

1,2 ప్రతివాదులకు దావా సమన్లు

1. అన్వర్మన్సూర్హుసేన్ తండ్రి సుల్తాన్ మొహద్దీన్,
2. తసాదుక్ హుసేన్ తండ్రి సుల్తాన్ మొహద్దీన్,

ఇద్దరి నివాసం. ఇంటి.నెం.39-7డి, కె.వి.ఆర్.గార్డెన్, కర్నూలు.

పై నెంబరు దావాలో వాది, ప్రతివాదులు మరియు వీరి మనుష్యులు,వారసులు దావాలో కనబరచిన షెడ్యూలు ఆస్థిపైన అక్రమంగా ప్రవేశించకుండా వాది యొక్క హక్కును బంగం కలుగకుండా మరియు దావా ఖర్చులు రాగోరి మరియు అక్రమించుకోకుండా యాడ్ - ఇంటరీమ్ ఇంజంక్షన్ ఇవ్వమని, వాది పై కోర్టులో ప్రతివాదులు అయిన మీపైన దావా దాఖాలు చేశారు. ఇందులో 1,2 ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 10-3-2025 తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అద్వకేటు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 10-3-2025

యస్.వి.క్రిష్ణారెడ్డి,
డి.జనార్ధన్,
వాది పరం అద్వకేట్లు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.పి.నెం.62/2021

ఆవుల గొల్ల గోపినాథ్. ...అర్జీదారు

-వర్సెస్-

యు.శ్రీకాంత్ మరియు వగైరా. ...రెస్పాండెంట్లు

4,6,12 రెస్పాండెంట్లకు నోటీసులు

4.) పి.ప్రభాకర్రెడ్డి, మేజర్, ప్రస్తుత నివాసం. కంబదహల్ (కంపాడు) గ్రామం, బెలగల్ మండలం, కర్నూలు జిల్లా
6). జి.పి.శ్రీనివాస రెడ్డి తండ్రి లేటు జి.పి.సీతారామిరెడ్డి, మేనెజర్, శ్రీశ్రీశ్రీ పద్మారైస్మిల్, ఇందిరాగాంధీకాలనీ దగ్గర, ఆదోని బైపాస్రోడ్డు, ఎమ్మిగనూరు టౌన్, కర్నూలు జిల్లా.
12).యు.కె.మహేశ్వర్లు, మేజర్, కర్నూలు కోర్టు, కర్నూలుటౌన్, కర్నూలు జిల్లా.

పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు ఆవుల గొల్ల గోపినాథ్ తండ్రి ఎ.జి.లక్ష్మణ్ణ ప్రస్తుత నివాసం. ఇంటి.నెం.3-93-2, గొల్లవీధి, ప్యాలకుర్తి గ్రామం, కోడుమూరు మండలం కర్నూలుజిల్లా అనునతడు తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి.అర్జీ దాఖలు చేసినాడు. ఇందుపైన 4,6,12వ రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 21-3-2025వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 21-3-2025

శ్రీ.యం. మురళీమోహన్రెడ్డి,
శ్రీమతి. యం. పుష్పలలితమ్మ,
అర్జీదారు తరుపు అద్వకేట్లు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.765/2023 ఇన్ ఓ.యస్.నెం.1257/2023

శ్రీమతి.యన్.రమాదేవి. ...అర్జీదారు /వాది

- ఎదురి -

అన్వర్మన్సూర్హుశేన్ మరియు ఒకరు ...రెస్పాండెంట్లు / ప్రతివాదులు

1,2 రెస్పాండెంట్లకు / ప్రతివాదులకు నోటీసులు

1. అన్వర్మన్సూర్హుసేన్ తండ్రి సుల్తాన్ మొహద్దీన్,
2. తసాదుక్ హుసేన్ తండ్రి సుల్తాన్ మొహద్దీన్,

ఇద్దరి నివాసం. ఇంటి.నెం.39-7డి, కె.వి.ఆర్.గార్డెన్, కర్నూలు.

పై నెంబరు దావాలో అర్జీదారు/వాది, రెస్పాండెంట్లు/ప్రతివాదులు వీరి మనుష్యులు దావాలోని షెడ్యూలు ఆస్థిపైన అక్రమంగా ప్రవేశించకుండా మరియు దావా ఖర్చులు రాగోరి మరియు అక్రమించుకోకుండా యాడ్-ఇంటరీం ఇంజక్షన్ కోరుతూ పై కోర్టులో అర్జీదారు అర్జీదాఖాలు చేసినారు, ఇందులో 1,2 రెంస్పాండెంట్లు/ప్రతివాదులు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 10-3-2025 తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అద్వకేటు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు:

కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, కల్లూరు గ్రామము సర్వే.నెం.680 విస్థీర్ణం ఎ.సి.0.30సెంట్లు.
తూర్పు : చింగి సుంకన్న భూమి.
పడమర : కె.జె.రెడ్డి భూమి.
ఉత్తరం : కుర్వ చిన్నరాముడు భూమి.
దక్షిణం :20 అడుగుల రోడ్డు మరియు ఇదే సర్వే.నెం.మిగిలిన భూమి.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 10-3-2025

యస్.వి.క్రిష్ణారెడ్డి,
డి.జనార్ధన్,
అర్జీదారు పరం అద్వకేట్లు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.యస్.నెం.1295/2022

శ్రీమతి.యస్.నాగేశ్వరమ్మ మరియు మరొకరు. ...వాదులు

- వర్సెస్ -

కె.క్రిష్టమ్మ మరియు ఇతరులు. ...ప్రతివాదులు

రెండవ ప్రతివాదికి దావా సమన్లు

2). యస్.యండి.రషీద్ తండ్రి యస్.మాసూమ్ వలి ఇంటి.నెం.45/24కె-46-3, అజీంవుద్దీన్ నగర్, కర్నూలు.

పై నెంబరు దావాలో వాదులు, ప్రతివాదుల ఆస్తిపై డిక్లరేషన్ కోరుతూ మీపైన దావా దాఖలు చేసినారు. ఇందులో 2,ప్రతివాది అయిన నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 24-3-2025వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అద్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపు కొనగలరు. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

Schedule:

House plot bearing plot No.56 B, in survey No.138 admeasuring 133.33 Sq Yards or 1200 Sq Feets, Plotted under L.P.No.431/85,Situated at Indraprastha Nagar, Kallur Village & Mandal,Kurnool Dist.A.P.

Measuring.:
East - West : 60 feets.
North - South : 20 Feets

Bounded on :
East : 33 feets road
West : plot No.47/A
North : Plot No.57A and
South : Plot No.56A

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 24-03-2025

యం. డి.వి.జోగయ్యశర్మ,
వాదిపరం అద్వకేటు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.494/2025 ఇన్ ఓ.యస్.నెం.1295/2022

శ్రీమతి.యస్.నాగేశ్వరమ్మ మరియు మరొకరు ...అర్జీదారులు/వాదులు

- వర్సెస్ -

కె.క్రిష్టమ్మ మరియు ఇతరులు. ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

2,వ రెస్పాండెంటు కు నోటీసులు

2). యస్.యండి.రషీద్ తండ్రి యస్.మాసూమ్ వలి ఇంటి.నెం.45/24కె-46-3, అజీంవుద్ధీన్ నగర్, కర్నూలు.

పై నెంబరు దావాలో అర్జీదారులు/వాదులు, రెస్పాండెంట్లు/ప్రతివాదులు అయిన మీపైన దావాలో తెలిపిన దావా షెడ్యూలు ఆస్తిపై అద్వకేటు కమీషనర్ను నియమించమని కోరుతూ అర్జీదాఖలు చేసినారు. ఇందులో రెండవ రెస్పాండెంటు/ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 24-03-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అద్వకేటు ద్వారా కాని పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

Schedule:

Vacant House plot bearing plot No.56 B, in survey No.138 admeasuring 133.33 Sq Yards or 1200 Sq Feets, Plotted under L.P.No.431/85,Situated at Indraprastha Nagar, Kallur Village & Mandal, Kurnool Dist.A.P.

Measuring.:
East - West : 60 feets.
North - South: 20 Feets

Bounded on :
East : 33 feets road
West : plot No.47/A
North : Plot No.57A and
South : Plot No.56A

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 24-03-2025

యం.డి.వి. జోగయ్యశర్మ,
వాదిపరం అద్వకేటు, కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.ఎ.నెం.751/2024 ఇన్ ఓ.యస్.నెం.1/2023

ప్లాటు ఒనర్ ఇన్ సర్వే నెం.161 మరియు 162 ఆఫ్ జోహరాపురం గ్రామం, కర్నూలు రెప్రజెంటెడ్ బై టి.కోటేశ్వరరెడ్డి. ...అర్జీదారు/వాది

- వర్సెస్ -

పి.బంగారయ్య మరియు ఇతరులు. ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

నోటీసు టు ప్రపోజ్డ్ పార్టీలు 2 మరియు 5రెస్పాండెంట్లకు
ఆర్డర్ 22 రూలు 4 సి.పి.సి ప్రకారం నోటీసులు

2. టి.రమాదేవి భర్త టి. మురళీక్రిష్ణ, ఇంటి.నెం.46/791-418, ఎ.క్యాంపు, కర్నూలు.
5. టి.ఆమ్మజి రేణుక భర్త రామాంజనేయులు, ఇంటి.నెం.46/791-418, ఎ.క్యాంపు, కర్నూలు.

పైన కనబరచిన జోహరాపురం సర్వే నెం.161 మరియు 162లలో ప్లాటు కొన్న ఓనర్సందరూ కలసి 1 నుండి 4 వరకు ప్రతివాదులు ఫోర్జరీ పత్రములు సృష్టించి, తాము కొన్న ప్లాట్లు అన్ని తమవే అంటూ వాదులు(ప్లాటు ఓనర్సుకు) హక్కు స్వాధీనమునకు యిబ్బంది కలిగిస్తున్నందున పై కనబరచిన వాదులు, ప్లాటు ఓనర్సందరి తరపున ఈ దావా దాఖలు చేసి వుంటున్నారు. దావాలో 3వ ప్రతివాది టి.క్రిష్ణ 13-6-2024న మరణించినందున,మిమ్ములను వారి వారసులు 2 మరియు 5 లను పై దావాలో పార్టీలుగా / ప్రతివాదులుగా చేర్చమని కోరుతూ ఈ అర్జీ ఐ.ఎ.నెం.751/2024 దాఖలు చేసి వున్నారు. కనుక ఈ విషయంలో ప్రపోజ్డ్ పార్టీలు 2 మరియు 5 అయిన మీ యిరువురికి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 17-3-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదురు అర్జీని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 17-3-2025

ఎ. శివరామయ్య,
అర్జీదారుల తరపు న్యాయవాది,
కర్నూలు.

సమాజమార్పునకు రచనలు రావాలి

తెలుగుభాష నలుమూలలా విస్తరించాలి- నరసం రాష్ట్ర సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

తెలుగు రచయిత్రులు తెలుగు భాషను నలుమూలలా విస్తరించేలా, సమాజ మార్పునకు ఉపయోగపడేలా తమ రచనలను సాగించాలని పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరిత అన్నారు. ఆదివారం కర్నూలు సి క్యాంప్ సెంటర్లోని టీజీవి కళాక్షేత్రంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఏడవ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సు కర్నూలు జిల్లా అధ్యక్షులు కావెంసుబ్బలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. గౌరు చరిత మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే మార్పులను గమనిస్తూ ప్రస్తుత సమాజాన్ని అనుభవించుకుంటూ రచయితలు తమ రచనలు చేయాలని సూచించారు. ప్రముఖ భాషావేత్త ఆయుర్వేద వైద్యులు కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ గ్రంథాలయ సృష్టికర్త గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గ్రంథాల నిలయంగా ఉండే విధంగా ఎంతో కృషి చేశారన్నారు. దళిత ముఖ్యమంత్రిని దామోదరం సంజీవయ్యను ఇచ్చిన కర్నూలు జిల్లా గొప్పతనాన్ని గురించి వివరించారు. కర్నూలు సాహితీ సదస్సు తెలుగు భాషా వికాస ఉద్యమకారుడు కార్యదర్శి జెఎస్ఆర్కె శర్మ మాట్లాడుతూ స్త్రీ గొప్పదనం గురించి చెబుతూ స్త్రీ పురుషుల మధ్య భేదభావాలు విడనాడాలన్నారు. తన పద్యాలలో వనిత వజ్రాల దండగ అభివర్ణించారు. ఒంగోలు నరసం వ్యవస్థాపకురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ స్త్రీ రచయితలు భాషా పరిరక్షణకు పాటుపడుతూ భాష పరిణామం చెందుతూ ఉన్న సమయంలో భాషలో సంస్కారం తీసుకురావాలన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ ఆచార్య సాయి గోపాలు, రిజిస్ట్రార్ కట్టం వెంకటేష్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు యూనివర్సిటీలో పెట్టాలని సూచించారు. కురాడి చంద్రశేఖర కల్కూర, రచయిత ఇనయతుల్లా మాట్లాడుతూ వీర వనితల కథలు రాయాలని అన్నారు. మహిళల గొప్ప తనాన్ని వివరించారు. కస్తూరిబాగాంధీ, ఇందిరాగాంధీ వంటి వీర వనితల గురించి వివరించారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో సర్దార్ అమరావతమ్మ, నంద్యాల పద్మావతమ్మ సమాజానికి చేసిన సేవలను వివరించారు. నరసం లాంటి వేల సంస్థలు ఏర్పడాలని మహిళపై అత్యాచారం చేసే మృగాళ్ల వెన్నులో వణుకు పుట్టించేలా కవితలు రావాలన్నారు. నరసం కర్నూలు కథలు కందనవోలు కవయిత్రులు సంపాదకత్వం డాక్టర్ కర్నాటి చంద్రమౌళి, ఏ వరలక్ష్మి రచనలు అయినా బామ్మతో బాలలు, శివ లీలలు, బొమ్మతో ముచ్చట్లు చల్ల పిల్లరాయిని చరిత్ర, దైవం దీన్నే సంస్థానం సాహిత్యం పుస్తకాల ఆవిష్కరణలు చేశారు. ఒంగోలు కళామిత్ర మండలి జాతీయ స్థాయి పురస్కారం ప్రధానోత్సవం ఒంగోలు జాతీయ అధ్యక్షుడు నూనెఅంకమ రావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి అవార్డు కమిటీ చైర్మన్ అరుణల ఆధ్వర్యంలో సింహాద్రి విశాలాక్షి స్మారక సాహితి ప్రతిభా పురస్కారం డాక్టర్ దండెబోయిన పార్వతి దేవికి అందజేశారు. గతంలో ఈ పురస్కారానికి ఎంపికయిన ఆమెకు ఈసందర్భంగా అందజేశారు. ఆవోప విభాగం ఆధ్వర్యంలో మహిళలు అమ్మ భవాని లోకాలనేలే ఓంకార రూప మమ్మ నీ మహిమల్ని చూపవమ్మా అంటూ కోలాట నత్యం చేశారు. రచయిత్రుల సమక్షంలో సమకాలీన సమస్యలు రచయిత్రుల కర్తవ్యం అనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సుకు రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ఒరిస్సా బరంపురం ప్రముఖ సాహితీవేత్త తుర్లపాటి రాజేశ్వరి ప్రసంగించారు. ఐద్వా సీనియర్ నాయకులు పి.నిర్మల, కర్నూలు ప్రధాన కార్యదర్శి ఎన్.అలివేలు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా కర్నూలు ప్రజానాట్యమండలి గాయని ఆర్ఏ సుజాత, బసవరాజు, డప్పు సుబ్బరాయుడులు మహిళల, జిల్లా ఔన్నత్యాన్ని గురించి పాటలు వినిపించి సభికులను మైమరిపించారు. వ్యాఖ్యత కండే సునీత ముఖ్య అతిథులను సభ పైకి ఆహ్వానించారు.


ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరిత


ఆరెపల్లి వరలక్ష్మమ్మ రచించిన బామ్మతో బాలలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, విసి సాయిగోపాల్, తేళ్ల అరుణ తదితరులు

ఘనంగా శ్రీకష్ణదేవరాయల జయంతి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్.

శ్రీకృష్ణ దేవరాయల 555వ జయంతి వేడుకలు కర్నూలులో ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగర తెలగ కాపు బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్పొరేటర్లు రమణమ్మ, సాంబశివరావులు శ్రీకష్ణదేవరాయల వారి విగ్రహానికి గజమాల వేసారు. అనంతరం బలిజ సంఘం పెద్దలు అర్జా రామకృష్ణ, పత్తి ఓబులయ్య, డాక్టర్ కుళ్లాయప్ప, భాస్కర్ బాబు కేక్ కట్ చేసారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ మాట్లాడుతూ తన పరిపాలనా కాలంలో అనేక చెరువులు, కాలువలు తవ్వించి దక్షిణ భారతదేశాన్ని సస్యశ్యామలం గావించడమే కాకుండా అనేక దేవాలయాలు నిర్మించి సాహితీ సమరాంగణ సార్వభౌమ గా పేర్గాంచిన కష్ణదేవరాయల వారి జన్మదినం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 16 తేదీ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేసారు. అనంతరం ఇటీవల కర్నూలు జిల్లా పోక్సో కోర్టు కు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన అడ్వకేట్ శ్రీనివాసులు ను ఘనంగా సత్కరించారు. సంఘం గౌరవ సలహాదారులు సోమశేఖర్ మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ సబ్సిడీ రుణాల యూనిట్ల సంఖ్యను పెంచాలని, కాపు భవన్ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని, బలిజ వారికి నామినేటెడ్ పోస్ట్ లలో తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈశ్వర్ కుమార్, శైలేష్, స్వామి రెడ్డి, ఉలిందకొండ రమణ, రామిరెడ్డి, మోహన్, రామనాథ్, సహదేవుడు, ప్రభాకర్ రెడ్డి, భూపతిరావ్, ప్రకాశ్, బాలరాజు, ప్రకాశ్ బాబు, రాజు, గురుశేఖర్, అపురూప్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, భవాని, నాగప్రసాద్, రాఘవేంద్ర ప్రసాద్, మహీపతిరావు, వేణు, గిరి, రంగనాయకులు, రంగయ్య, సురేష్, కోటేశ్వరరావు, సంజీవ్, సుబ్రహ్మణ్యం, మాణిక్యం మనోహర్, కార్తీక్, సుధాకర్, రాజేంద్ర జగదీష్, తదితరులు పాల్గొన్నారు,



విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఎడిఎ ఖాద్రి, ఎఒ హేమలత

ప్రజాశక్తి - గోనెగండ్ల

ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం గోనెగండ్ల మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎమ్మిగనూరు ఎడిఎ మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఎఒ హేమలత తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకు రావడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇప్పటివరకు గోనెగండ్ల మండలంలో 5673 రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యిందని, ఇంకా దాదాపు 9000 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకొంటేనే వారికి పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల నష్టం,పంట భీమా వంటి పథకాలు అందుతాయని కాబట్టి ప్రతి రైతు వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కొర్ర ,కంది పొట్టు, వరి గడ్డి వాము దగ్ధం

ప్రజాశక్తి- సి బెళగల్ : సి బెళగల్ మండలం యనగండ్లలో రైతు దేవరాజుకు చెందిన కొర్ర గడ్డి, కంది గింజల పొట్టు, వరి గడ్డి వాము ఆదివారం అగ్నికి అహుతి అయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులా లేక ఎవరైనా కావాలనే నిప్పుపెట్టారా అన్న కోణంలో ఎస్ఐ తిమ్మారెడ్డి విచారణ చేపట్టారు. కొర్రగడ్డి రూ 40 వేలు, కంది గింజల పొట్టు రూ 30 వేలు, వరి గడ్డి వాము రూ 50 వేలు మొత్తానికి లక్ష ఇరవై వేలు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. మూగ జీవాల కోసం,గొర్రెల మేకల కోసం సిద్ధం చేసుకున్నదంతా అంతా బూడిదయింది. నేడు తహసీల్దార్ పురుషోత్తం, విఆర్ఒ రామ్ మోహన్రెడ్డి తగు నివేదికలు తయారు చేసి నివేదిక నిచ్చారు.